# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 02-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన రాష్ట్రాల గవర్నర్ల సదస్సు ఈరోజు ప్రారంభమైంది.**

**2.** **ఎన్టీఆర్ భరోసా కింద ఒక్క రోజులోనే రాష్ట్రంలో 97.54 శాతం పింఛన్ల పంపిణీ చేయడం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**3.** **పారిశ్రామికవేత్తలు రష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు.**

**4.** **గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనిమియా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ సి.హరికిరణ్ అధికారులను ఆదేశించారు.**

**5.** **ప్రముఖ నాటకరంగ నటులు బళ్లారి రాఘవగా ప్రసిద్ధికెక్కిన తాడిపత్రి రాఘవాచార్యులు జయంతి ఈరోజు.**

==========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రెండు రోజుల పాటు రాష్ట్రాల గవర్నర్ల సదస్సు ఈరోజు ప్రారంభమైంది. ఈ సదస్సుకు రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ తో సహా అన్ని రాష్ట్రాల గవర్నర్లు, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు హాజరయ్యారు. నీతి ఆయోగ్ ముఖ్యకార్యనిర్వహణాధికారితో పాటు ప్రధానమంత్రి కార్యాలయ సీనియర్ అధికారులు, హోం మంత్రి కార్యాలయ అధికారులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ఈ సమావేశంలో కొత్తగా తీసుకొచ్చిన మూడు చట్టాల అమలు, ఉన్నత విద్యలో సంస్కరణలు, ఇతర అభివృద్ధి అంశాలపై ప్రధానంగా చర్చిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా కింద ఒక్క రోజులోనే 97.54 శాతం పింఛన్ల పంపిణీ చేయడం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఆగస్టు ఒకటో తేదీనే ఇంటి వద్దకే 64 లక్షల మందికి పెంచిన పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారుల ఆర్థిక భద్రత తమ బాధ్యత అన్నారు. పెరిగిన పింఛను పేదల జీవితాలకు భరోసా కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులందరికీ చంద్రబాబు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు అంటే ప్రభుత్వంలో

భాగమని రాష్ట్ర పునర్నిర్మాణ కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

--------------------------

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్– యూఏఈ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. యూఏఈ–ఇండియా సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం ఒప్పంద కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక, పెట్టుబడుల అంశంపై నిన్న విజయవాడలో మంత్రి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన పారిశ్రామికవేత్తలతోపాటు భారత్ లో యూఏఈ రాయబారి అబ్దుల్ నాసిర్ జమాల్ అల్‌షాలీ ఇతర వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.రాష్ట్రంలో ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకునేందుకు యూఏఈ ఆసక్తి చూపుతోందని మంత్రి తెలుపుతూ..

వాయిస్ (21 సెకన్లు)

--------------------------

గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనిమియా నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ సి.హరికిరణ్ అధికారులను ఆదేశించారు. జాతీయ సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్ పై మంగళగిరిలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ హరికిరణ్ మాట్లాడుతూ, గిరిజన గ్రామ పంచాయతీ సమావేశ అజెండాలో సికిల్ సెల్ ఎనీమియా అంశాన్ని కూడా చేర్చేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా సికిల్సెల్ ఎనిమియా బాధితుల్ని స్క్రీనింగ్ చేయాలని, ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎనీమియా నిర్మూలన కార్యక్రమం కోసం వినూత్న విధానాల్ని అవలంబించాలని సూచించారు.

--------------------------

ఆంధ్ర నాటక రంగంలో సరికొత్త మార్పులకు నాంది పలికిన నటులు, ప్రయోక్త, నాటక రచయిత బళ్లారి రాఘవగా ప్రసిద్ధికెక్కిన తాడిపత్రి రాఘవాచార్యులు జయంతి ఈరోజు. 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా, తాడిపత్రిలో జన్మించారు.కానీ బళ్లారిలో స్థిరనివాసం ఏర్పరచుకోవటం వల్ల బళ్ళారి రాఘవగా ప్రసిద్ధులయ్యారు. హరిశ్చంద్ర, బృహన్నల, పాదుకా పట్టాభిషేకం, సావిత్రి, రామరాజు చరిత్ర, రామదాసు మొదలైన నాటకాల ద్వారా తెలుగునాట ప్రసిద్దులైయ్యారు. బళ్లారి రాఘవాచార్యులు 1946 ఏప్రిల్ 16 న తుది శ్వాస విడిచారు. భారత ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు ప్రాంత రైతుల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందిస్తామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లాలోని ముసునూరు మండలం కాట్రేనిపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పించన్లను మంత్రి లబ్ధిదారులకు నిన్న అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని చింతలపూడి ఎత్తిపోతల పథకంను త్వరలో పూర్తిచేసి నూజివీడు ప్రాంత రైతులకు సాగునీటిని అందిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్లో ప్రధానమైన అయిదు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిరయించామని వాటిలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కూడా ఒకటని తెలిపారు. ముసునూరు మండలంలో మురుగునీటి వ్యవస్థ, రహదారుల సమస్యలను రెండు నెలల్లో పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు

--------------------------

తిరుపతి జిల్లా వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్యశాఖతోపాటు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల యొక్క ప్రాముఖ్యత, తల్లిపాలను తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి ఏ విధంగా పిల్లల్లో పెరుగుతుందన్న విషయంపై బాలింతలకు గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించారు. వారం రోజులపాటు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తామని శ్రీకాళహస్తి వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆకాశవాణికి పేర్కొంటూ,

వాయిస్ ( 30 సెకన్లు )

---------------------------

దేశం గౌరవించే జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య రాష్ట్రానికి చెందినవారు కావడం గర్వకారణమని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి తెలిపారు. ఈ రోజు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పింగళి వెంకయ్య తెలుగువారికి కీర్తి పతాకం వంటి వారని ఆయన బందరు ప్రాంతంలో పుట్టడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్యకళాశాలకు పింగళి పేరు పెట్టడమే సరైన నివాళి అని పేర్కొన్నారు. పింగళి పేరు అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి లేఖ రాశామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ని విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో నిర్వ హించనున్న 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 ఏర్పాట్లపై నిన్న రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు శాఖల వారీగా ఏర్పాట్లు చేయాలని రాజభవన్‌లో జరిగే ఎట్ హోంకు కూడా విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆయా శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలని సూచించారు. రాజ్ భవన్, హైకోర్టు, శాసనసభ, సచివాలయం సహా ఇతర ప్రముఖ కార్యాలయాలు, భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని కోరారు.

---------------------------

వరదలు, భారీ వర్షాలకారణంగా దెబ్బతిన్నపంటల స్థానంలో మళ్లీ విత్తుకునేందుకు వీలుగా 80 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీచేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఒక ప్రకటనలోతెలిపారు. జూన్, జూలైలో సాధారణానికి మించి 48.6 శాతం అధికంగా వర్షపాతం నమోదైందన్నారు. ఫలితంగా 1 వెయ్యి 406 హెక్టార్లలో నారుమళ్లు, 33 వేల హెక్టార్లలో నాట్లు ముంపునకు గురయ్యాయన్నారు.వీటి కోసం ప్రత్యామ్నాయ పంటలప్రణాళిక రూపొందించామన్నారు. ఉభయగోదావరి,ఏలూరు, కాకినాడ, అనకాపల్లిజిల్లాల్లో పంపిణీ కోసం ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా 6,356 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేశామని వీటిని రాయితీపై రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

====================